కేసీఆర్ ట్రోఫీ ఫైనల్స్‌కి రావాలి

మాజీ మంత్రి హరీశ్‌రావుని ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్, బాల్‌రెడ్డి, మాణిక్‌యాదవ్

రామచంద్రాపురం, డిసెంబర్ 13: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ఐలాపూర్‌లో 'కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ' జరుగుతున్నది. ఐలాపూర్ బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్‌యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నమెంట్ 15వ తేదీన ఆదివారం ముగుస్తుండడంతో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుని ఆయన నివాసంలో కార్పొరేటర్ మెట్టు కుమార్, బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మాణిక్‌యాదవ్ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ వారంరోజులుగా అట్టహాసంగా క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్నదని పేర్కొన్నారు. విజేతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా ట్రోఫీ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, శ్రీధర్‌చారి, కృష్ణాకాంత్, క్రాంతి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, డిసెంబర్ 13: జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ శుక్రవారం ప్రకటనలో కోరారు. స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు జరిగే లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ కుదుర్చొని కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరుపక్షాలు కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు.

లగచెర్ల రైతుకు సంకెళ్లు వేస్తారా

నారాయణఖేడ్: సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గిరిజన నాయకులు

నారాయణఖేడ్, డిసెంబర్ 13: జైలులో గుండెపోటుకు గురైన లగచెర్లకు చెందిన గిరిజన రైతు హీర్యానాయక్‌ను దవాఖానకు సంకెళ్లు వేసి తీసుకెళ్లడం దారుణమని బీఆర్ఎస్ గిరిజన నాయకులు ప్రభుత్వంపై మండిపడ్డారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ విలేకరులతో మాట్లాడుతూ లగచెర్లలో రైతుల భూములను బలవంతంగా తీసుకోవడమే కాకుండా వారిపై అక్రమ కేసులు బనాయించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన నిరంకుశత్వాన్ని చాటుకుందన్నారు. అమాయక రైతులను ఉగ్రవాదుల మాదిరిగా సంకెళ్లు వేసి తీసుకెళ్లడం, దవాఖానకు వచ్చిన వారి కుటుంబ సభ్యులను సైతం కలవనీయకుండా అడ్డుకోవడం అమానవీయమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులు, రైతులపై అఘాయిత్యాలు మానుకోకపోతే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు రాజునాయక్, రవీందర్‌నాయక్, విఠల్‌రావు, సాయిలు, మాజీ ఎంపీటీసీ రాజునాయక్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, సంతోష్‌నాయక్, శంకర్‌నాయక్, సర్దార్‌నాయక్, వెంకట్, శ్రీనివాస్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను విడుదల చేయాలి

గుమ్మడిదల, డిసెంబర్ 13: లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడుతూ జైలులో లగచర్ల గిరిజన రైతు హీర్యానాయక్‌కు గుండెనొప్పి రావడంతో ఆ రైతును బేడీలతో దవాఖానకు తరలించడం హేయమైన చర్య అన్నారు. ఇది కాంగ్రెస్ సర్కారు క్రూరత్వానికి నిదర్శనమన్నారు. అరెస్ట్ చేసిన లగచర్ల భూబాధితులను వెంటనే విడుదల చేసి వారికి సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. ఎలాంటి తప్పు చేయని రైతులను జైల్లో నిర్భందించడం సరికాదన్నారు. నాయకులు చిమ్ముల దేవేందర్‌రెడ్డి, అయ్యగారి రవీందర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, నల్తూరు యాదగిరి సాయికుమార్ ఉన్నారు.

మల్లన్న జాతరకు ఆహ్వానం

ఎమ్మెల్సీ కవితతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు

నారాయణఖేడ్, డిసెంబర్ 13: నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌లో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న మల్లన్న జాతరకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించినట్లు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసి మల్లన్న కల్యాణోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ కవిత హాజరయ్యే అవకాశం ఉందని, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని భూపాల్‌రెడ్డి కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్ కుమ్మరి సిద్దులు ఉన్నారు.

'అమృత్'తో చెరువులకు మహర్దశ

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 13: రూ.1,100 కోట్లతో ఏడు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జలమండలి ఎస్టీపీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో ఏడు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. బీపోటీ పద్ధతిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని తిమ్మక్క చెరువు, మేళ్ల చెరువు, ఉసికేబావి, ఇక్రిసాట్, గండిగూడెం, బచ్చుగూడెం, అమీన్‌పూర్ పరిధిలోని చెరువుల సమీపంలో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపాలని కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్లాంట్ల పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి దేవుజా, జలమండలి డీజీఎం లు బాబు, దీపాలి, శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు రంగారావు, రాధ, సంగ్రామ్, భిక్షపతి, గంగాభవాని పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గుమ్మడిదల, డిసెంబర్ 13: నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 208 మంది లబ్ధిదారులకు రూ.2.8 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు.

పల్వనూర్‌లో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు

హత్నూర, డిసెంబర్ 13: మండలంలోని పల్వనూర్‌లో శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయం వద్ద ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనము, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమంగా షెడ్డు నిర్మాణం!

బొల్లారం పారిశ్రామిక వాడలో అక్రమంగా వెలిసిన షెడ్డు

బొల్లారం, డిసెంబర్ 13: పారిశ్రామిక వాడలో అనుమతులు లేకుండా అక్రమ షెడ్ల నిర్మాణం జోరుగా సాగుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బొల్లారం పారిశ్రామిక వాడలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ యూనిట్ 2 పరిశ్రమ వెనక భాగంలో అక్రమంగా షెడ్డు ఏర్పాటు చేశారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా షెడ్ల నిర్మాణం జరుగుతుందని వాపోతున్నారు. భారీ ఎత్తున అక్రమ షెడ్డు నిర్మాణం చేస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా వెలుస్తున్న షెడ్లపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాలాపై అక్రమ నిర్మాణం తొలిగింపు

బీరప్ప బస్తీలో నాలాపై నిర్మించిన కట్టడాన్ని తొలిగిస్తున్న కార్మికులు

బొల్లారం, డిసెంబర్ 13: నాలాపై అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో నాలాపై అక్రమంగా మరుగుదొడ్డి నిర్మించారు. అక్రమ నిర్మాణంపై మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ మున్సి నవీన్ మున్సిపల్ కార్మికులతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయించారు. నిబంధనలు ఉల్లంఘించి నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పంటల దిగుబడి

జహీరాబాద్, డిసెంబర్ 13: పొలంలో ఏ పంట అయినా అధిక దిగుబడులు రావాలంటే భూసార పరీక్ష తప్పనిసరని జహీరాబాద్ డీడీఎస్-కేవీకే కేంద్రం భూసార పరీక్ష నిపుణుడు స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని రంజోల్, హుగ్గేల్లి గ్రామాల్లో రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను తగిన మోతాదులో వేసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ముత్తంగిలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పటాన్‌చెరు, డిసెంబర్ 13: మండల పరిధిలోని ముత్తంగిలో శుక్రవారం మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గడీల కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు సిల్వరి శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ గ్రామస్థాయి సమావేశానికి కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అభయహస్తం గుర్తు ఉన్న విగ్రహాన్ని ఆవిష్కరించిందని, అందుకు నిరసనగా తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు స్వచ్ఛంగా ప్రగతిపథంలో పయణించాయన్నారు. కాంగ్రెస్ రాగానే చీకటి రోజులు వచ్చాయని ఆరోపించారు. ముత్తంగిలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్ల సమస్యలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కిట్టు ముదిరాజ్, గ్రామ అధ్యక్షుడు రామకృష్ణముదిరాజ్, రాజేశ్వరశర్మ, మైనార్టీ నాయకులు అబేద్, మెరాజ్‌ఖాన్, సందీప్‌ముదిరాజ్, కర్నోళ్ల రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌జీటీయూ నాయకులు

హత్నూర, డిసెంబర్ 13: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం ఎస్‌జీటీయూ రాష్ట్రశాఖ తరపున మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌జీటీయూ నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలని కోరారు. అప్పటివరకు పేస్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్‌యాదగిరి, కోశాధికారి దుర్గం శ్రీనివాస్, డీపీవో వ్యవస్థాపక అధ్యక్షుడు ముగిలిపలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

జహీరాబాద్, డిసెంబర్ 13: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని జహీరాబాద్ ఎమ్మార్సీ కార్యాలయ కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, లేనిచో పే స్కేల్ ప్రకటించి, తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ ఉద్యోగులు సంగమేశ్వర్, ప్రశాంత్, అశోక్, వేణు, విజయ్, విమల, లక్ష్మి, తుక్కమ్మ పాల్గొన్నారు.

దత్తగిరి క్షేత్రంలో చండీ హోమం

దత్త, చండీయాగంలో ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర స్వామి

ఝరాసంగం, డిసెంబర్ 13: మండలంలోని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 15న నిర్వహించే దత్త జయంతి సందర్భంగా శుక్రవారం ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో 21 యజ్ఞ గుండాలలో దత్తాత్రేయ యజ్ఞం, ఐదు యజ్ఞాలతో చండీ హోమాన్ని వైదిక మంత్రాలతో శాస్త్రోక్తంగా ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కార్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు హాజరై దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ యాగం మూడు రోజుల పాటు కొనసాగనుంది.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ఎస్పీ చెన్నూరి రూపేశ్

మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

జహీరాబాద్, డిసెంబర్ 13: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, క్రైం రేట్ వివరాలను డీఎస్పీ రామోహ్మన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జహీరాబాద్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి, డ్రగ్స్ అక్రమంగా తరలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పేకాట, జూదం, మట్కా నిర్మూలనకు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూస్తామన్నారు. జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అవరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొత్తగా వచ్చిన సిబ్బందితో పోలీస్‌స్టేషన్లలో సమస్యలు తొలిగిపోయాయన్నారు. జహీరాబాద్ పోలీస్‌స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, రూరల్ సీఐ జక్కుల హనుమంతు, జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇస్నాపూర్‌లో దివ్యాంగుల ర్యాలీ

ఇస్నాపూర్‌లో ర్యాలీ చేస్తున్న దివ్యాంగులు

పటాన్‌చెరు, డిసెంబర్ 13: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇస్నాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో యువ చైతన్య దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం శ్రీశైలం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా అండగా ఉంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయశ్రీ, బాపు వెంకన్న, తెలంగాణ కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మడపతి రవికుమార్, కంచిగారి మహేష్‌కుమార్, బుజ్జి మహేష్, సుల్తానా పద్మ పాల్గొన్నారు.

బడికి ఫర్నిచర్.. పిల్లలకు వాటర్ బాటిల్స్

కంది, డిసెంబర్ 13: ఉన్నత్ భారత్ అభియాన్ కింద సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల (హైదరాబాద్) ఆధ్వర్యంలో శుక్రవారం కంది మండలంలోని ఎర్దనూర్, వడ్డెనగూడ, కంది తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఫర్నిచర్, విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఉన్నత్ భారత్ అభియాన్ సహకారంతో తండాల్లో దత్తతకు తీసుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల బృందం కృషి చేస్తున్నది. వీటితోపాటు దివ్యాంగుల సోలార్ సొసైటీకి ఫర్నిచర్, కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత్ భారత్ అభియాన్ సభ్యులు సూజత, రూపాలి, రవికుమార్, నాయకులు సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన దొంగ

రామచంద్రాపురం, డిసెంబర్ 13: ఆర్సీపురం డివిజన్‌లోని సాయినగర్‌కాలనీలో ఇటీవల ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్స్పెక్టర్ జగన్నాథ్, డీఐ శ్రీకర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నంకు చెందిన మహమ్మద్ హమీద్(20) ఈ నెల 8న అర్ధరాత్రి సాయికాలనీలోని రిటైర్డ్ కానిస్టేబుల్ రామకృష్ణరావు ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. 5వ తేదీన రామకృష్ణరావు, తన భార్యతో కలిసి శంకర్‌పల్లిలోని తన కూతురు ఇంటికి వెళ్లాడు. 8న రాత్రి రామకృష్ణరావు కుమారుడు వేణుగోపాల్ రాత్రి పడుకునే ముందు మెయిన్‌డోర్ సెంట్రల్ లాక్ వేయడం మర్చిపోయి గొళ్లం పెట్టి పడుకున్నాడు. అర్ధరాత్రి హమీద్ కిటికీ నుంచి మెయిన్‌డోర్ తెరిచి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడి ఇంట్లో మొత్తం కారం చల్లి పారిపోయాడు. తెల్లవారుజామున చిందరవందరగా బట్టలు, వస్తువులు పడిఉన్న విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. కొల్లగొట్టిన 46 తులాల బంగారు ఆభరణాల్లో సుమారు 16తులాల బంగారు ఆభరణాలు ఇంట్లోనే దొరికాయి. గురువారం రాత్రి మయూరినగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న హమీద్‌ను ఆర్సీపురం, సీసీఎస్ మాదాపూర్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించి అతని వద్ద నుంచి 15తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండిని స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇదివరకే పలు పోలీస్‌స్టేషన్‌లల్లో నిందితుడిపై కేసులు ఉన్నాయి. నిందితుడిని పట్టుకున్న ఇన్స్పెక్టర్లతోపాటు ఎస్సైలు శశికాంత్‌రెడ్డి, రామకృష్ణ, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

నల్తూరులో క్రషర్ ఏర్పాటు వద్దు

కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న నల్తూరు గ్రామస్తులు

బొల్లారం, డిసెంబర్ 13: గ్రామంలో క్రషర్ ఏర్పాటు చేయవద్దంటూ, ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని నల్తూరు గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా క్రషర్ ఏర్పాటు చేస్తే ప్రజారోగ్యంతోపాటు పశుసంపద, ఇండ్లు ధ్వంసం అవుతాయని వాపోయారు. గురువారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి గ్రామస్తులు తమ గోడును వెల్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని మైనింగ్ శాఖ అధికారులకు లేఖ రాశారని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఆ లేఖను గ్రామస్తులు అధికారులకు అందించి క్రషర్ ఏర్పాటును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్దన్, నాయకులు రాజేశ్, భీంరావు, పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 13: మనసులోని భావనలను వ్యక్తం చేసేందుకే 'విద్యార్థుల సృజనాత్మకత సదస్సు' నిర్వహించామని సెయింట్ పీటర్స్ పాఠశాల చైర్మన్ ఈధర ఆంథోనీరెడ్డి తెలిపారు. శుక్రవారం గణేష్ నగర్‌లోని సేయింట్ పీటర్స్ స్కూల్‌లో విద్యార్థుల సృజనాత్మకత సదస్సు నిర్వహించారు. పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అందమైన చిత్రాలతో కనువిందు చేసే ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆంథోనీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పాఠశాల అకడమిక్ అడ్వైజర్ రూబెన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవికుమార్‌రెడ్డి, లీడ్ అకడమిక్ ఎక్సలెంట్ మేనేజర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి

రాయికోడ్, డిసెంబర్ 13: యువతీ, యువకులు మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రాయికోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి అంజయ్య సమక్షంలో ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్‌లో విద్యను నేర్చుకున్నవారు ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్ డిగ్రీ సర్టిఫికెట్‌తో సమానం అన్నారు. ఈ అవకాశం ఈ నెల 16వ తేదీలోగా అడ్మిషన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి అంజయ్య, సిబ్బంది కైరత్‌అలీ, కోటేశ్వర్ ఉన్నారు.

'డబుల్' సముదాయంలో సౌకర్యాలు కల్పిస్తాం

రామచంద్రాపురం: కొల్లూర్ డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ శాఖ ఎండీ వీపీ గౌతమ్

పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించాలి

రామచంద్రాపురం, డిసెంబర్ 13: కొల్లూర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర హౌసింగ్ శాఖ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించారు.